క్లుప్తంగా

శివ భక్తులకు అన్నదానం

కర్నూలు కల్చరల్: బాలాజీ సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో శివ భక్తులకు అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. సోమవారం పెద్దపాడు రోడ్‌లోని కింగ్స్ ప్యాలస్ గ్రాండ్ కన్వెన్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని భావించి కర్ణాటక నుంచి శ్రీశైలానికి పాదయాత్ర చేసే శివభక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమన్నారు. శ్రీ భరత మాత ప్రఖండ అధ్యక్షు లు మొగిలి రవీంద్ర గౌడ్, ప్రాంత కోశాధికారి సందడి మహేష్, రాష్ట్ర బజరంగ్ దల్ కన్వీనర్ ప్రతాపరెడ్డి, జిల్లా కోశాధికారి శ్రీనివాస రెడ్డి,సహ కార్యదర్శి నాగరాజు కార్యనిర్వాహకుడు శివకోటి చంద్రశేఖర్, సేవా ట్రస్ట్ గౌరవ సలహాదారులు మేమారెడ్డి ధనుంజయరెడ్డి, శ్రీకాంత్, మాతృశక్తి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం ఎమ్మెల్యే అభ్యర్థికి సత్కారం

కర్నూలు(సెంట్రల్):సీపీఎం కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి డి.గౌస్‌దేశాయ్‌కు ఆటో డ్రైవర్లు సన్మానం చేశారు. సోమవారం నగరంలోని కొత్తపేట ఏరియాలోని సాయిబాబా ఆలయ ఎదుట ఉన్నా ఆటో స్టాండ్ డ్రైవర్లు సమావేశమయ్యారు. ఈ సమావేశానికి డి.గౌస్‌దేశాయ్‌ను ఆహ్వానించి ఆయనకు సన్మానం చేసి గెలుపు కోసం కృషి చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి కె.ప్రభాకర్, సీపీఎం జిల్లా నాయకులు నాగరాజు, ఎ.రవికుమార్ పాల్గొన్నారు.

సేవలతోనే గుర్తింపు

కర్నూలు: విధి నిర్వహణలో ఉద్యోగులు ప్రజలకు అందించే సేవలతోనే మంచి గుర్తింపు వస్తుందని ఎస్పీ కృష్ణకాంత్ అన్నారు. సుదీర్ఘకా లం పోలీసు శాఖలో పనిచేసిన కర్నూలు పట్టణానికి చెందిన ట్రాఫిక్ ఎస్ఐ టీఎస్ఎస్ ప్రసాద్ కుమార్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా సోమవారం క్యాంప్ కార్యాలయంలో ఎస్పీ కృష్ణకాంత్ ప్రసాద్ కుమార్‌కు శాలువ, పూలమాలలతో సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. పోలీసు శాఖకు అందించిన సేవలను ఈ సందర్భంగా ఎస్పీ కొనియాడారు. అడ్మిన్ అడిషనల్ ఎస్పీ నాగరాజు, పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు నాగరాజుతో పాటు ఎస్ఐ కుటుంబ సభ్యులు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం జిల్లా పోలీసు శాఖ తరఫున ప్రసాద్ కుమార్‌ను ఘనంగా వీడ్కోలు చెప్పారు.

హోంఓటింగ్‌పై అవగాహన

కర్నూలు(సెంట్రల్): ఏప్రిల్, మే మాసాల్లో హోం ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌పై తేదీల వారీగా నిర్వహించాల్సిన విధులపై రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లకు అవగాహన కల్పించారు. సోమవారం ఆయన విజయవాడ నుంచి వర్చువల్‌గా హోంఓటింగ్, పోస్టల్ బ్యాలెట్‌పై వర్చువల్‌గా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టర్ డాక్టర్ జి.సృజన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు.

బాధ్యతల స్వీకరణ

కర్నూలు (లీగల్) : నూతనంగా ఎన్నికైన కర్నూలు బార్ అసోసియేషన్ సభ్యులు సోమవారం తమ పదవీ బాధ్యతలు స్వీకరించారు. అధ్యక్షుడిగా బి.కృష్ణమూర్తి, ఉపాధ్యక్షుడిగా నిత్యజీవన రాజు, ప్రధాన కార్యదర్శిగా బీఎస్ రవికాంత్ ప్రసాద్, కార్యదర్శిగా విక్రమ్‌సింగ్, కోశాధికారిగా మహబూబ్ బాషా, గ్రంథాలయ కార్యదర్శిగా ఎస్.రామ్‌నాథ్, క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా బంగి సుధీర్, మహిళా ప్రతినిధిగా సుమన రాణి ఎన్నికైన విషయం తెలిసిందే. తాజా మాజీ అధ్యక్షుడు టి.నాగభూషణం నాయుడు, ప్రధాన కార్యదర్శి ఎంవీ చక్రపాణి తదితరులు పాల్గొని తమకు సహాయ సహకారాలు అందించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయి



కర్నూలు (హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల నర్సింగ్ సూపరింటెండెంట్‌గా సావిత్రిబాయిని నియమించారు. గ్రేడ్-2 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఆమెకు గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఇన్‌చార్జ్ బాధ్యతలను ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి అప్పగించారు. గ్రేడ్-1 నర్సింగ్ సూపరింటెండెంట్‌గా ఉన్న వెంకటతులసమ్మ గత నెల 31న పదవీ విరమణ చెందడంతో అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.

అగ్ని ప్రమాదంలో వ్యాపారి మృతి

పాములపాడు: మండల కేంద్రం పాములపాడు ఏకే ట్రేడర్స్ దుకాణంలో సోమవారం రాత్రి 11.30 గంటల సమయంలో షార్ట్‌సర్క్యూట్ జరిగిన ఘటనలో ఓ వ్యాపారి మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన ఫరూక్‌బాషా (58) రైతుల వద్ద వివిధ పంటల దిగుబడులు కొనుగోలు చేసి విక్రయిస్తుంటాడు. స్థానికంగా ఉన్న దుకాణంలో కొనుగోలుకు సంబంధించిన లెక్కలు చూసుకుంటుండగా కరెంట్ షార్ట్‌సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. రోడ్డుపై వెళ్తున్న స్థానికులు గమనించి మృతుడి కుమారుడు అక్బర్ బాషాకు సమాచారమిచ్చారు. ఆయన హుటాహుటిన దుకాణం వద్దకు చేరుకుని అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఫైరింజన్‌తో అక్కడికి చేరుకుని మంటలు ఆర్పివేశారు. దుకాణంలో ఉన్న ఫరూక్‌బాషా గుర్తుపట్టలేని విధంగా కాలిపోయాడు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు, కుమార్తె సంతానం. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చెంతకురాని పించన్

ఒకటో తేదీ వచ్చిందంటే చాలు అవ్వాతాతలు, దివ్యాంగుల ముఖాల్లో ఎనలేని సంతోషం. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా ఠంఛన్‌గా పింఛన్ వస్తుందని నమ్మకం. అది కూడా ఎలాంటి ఆపసోపాలకు అవకాశం లేకుండా ఉదయాన్నే వలంటీర్లు తలుపుకొట్టి పింఛన్లు అందజేస్తారని భరోసా. అయితే, ప్రతి నెల మాదిరిగా ఈనెల 1 తేదీ వలంటీర్ ఇంటికి రాలేదు. చేతికి పింఛన్ అందలేదు. దీనికంతటికి టీడీపీ అధినేత చంద్రబాబే కారణమని తెలుసుకొని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థపై ఆయన తొలి నుంచి అక్కసు వెళ్లగక్కుతున్నాడని మండిపడుతున్నారు.



వీకర్ సెక్షన్ కాలనీలో అంధుడికి పింఛన్ అందించేందుకు బయోమెట్రిక్ తీసుకుంటున్న వలంటీర్ (ఫైల్)

- గ్రామ/వార్డు సచివాలయ వలంటీర్లపై చంద్రబాబు అక్కసు
- ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు
- నిలిచిపోయిన వలంటీర్ల సేవలు
- పెన్షన్ల పంపిణీకి అంతరాయం
- 2019 నుంచి ప్రతి నెల 1 వ తేదీనే ఠంఛన్‌గా పింఛన్ల పంపిణీ
- టీడీపీ వైఖరితో సకాలంలో అందని పరిస్థితి
- ఆందోళనలో అవ్వాతాతలు



సాయిబాబా సంజీవయ్య నగర్‌లో దివ్యాంగుడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)



కరోనా సమయంలో దేవనగర్‌లో వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

కర్నూలు (టౌన్): గ్రామ స్వరాజ్యంలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2019 ఆగస్టు నెలలో సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చారు. ఈవ్యవస్థల ద్వారా ప్రజలకు ఇళ్ల వద్దే అవసరమైన సేవలు అందిస్తున్నారు. నాటి నుంచి మార్చి వరకు ప్రతి నెల 1 వ తేదీ ఆయా సచివాలయాల పరిధిలోని వలంటీర్లు ఉదయం 6 గంటలకే లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సామాజిక పెన్షన్లు పంపిణీ చేసే వారు. కర్నూలు నగరంలో 52 వార్డుల్లో 133 సచివాలయాలు ఉన్నాయి. 2200 మంది వలంటీర్లు పనిచేస్తున్నారు. ప్రతి నెల కర్నూలు నగరంలో అన్ని రకాల పెన్షన్లు కలుపుకొని 34, 232 మందికి రూ. 10,37,19,000 వేలు అందజేస్తున్నారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా చెంతకే పెన్షన్లు వస్తుండటంతో లబ్ధిదారుల ఆనందం అంతా ఇంత కాదు. వైఎస్ జగన్ పాలనలో తమకు పింఛన్ల కోసం తిరిగే పరిస్థితి లేదని అవ్వాతాతలు సంతోషించేవారు.

మళ్లీ నాటి పరిస్థితులు

తెలుగుదేశం పాలనలో లబ్ధిదారులు ఫించన్లు పొందేందుకు అష్టకష్టాలు పడేవారు. మున్సిపల్ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించి ఫించన్లు తీసుకోవాల్సిన పరిస్థితి. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, తదితర ఫించన్ లబ్ధిదారులు 1వ తేదీ ఉదయమే కార్యాలయం వద్దకు వచ్చి ఫించన్లు పంచే సిబ్బంది కోసం వేచి ఉండేవారు. వృద్ధులు, దివ్యాంగులు సైతం గంటల తరబడి క్యూలో నిలబడాల్సిన పరిస్థితి. కొన్ని సార్లు సర్వర్ పనిచేయక, మరికొన్ని సార్లు సిబ్బంది సమయానికి రాక పింఛన్ల కోసం ఎదురు చూడాల్సి వచ్చేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో అవ్వా తాతలు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ల అవస్థలను గమనించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి నెలా లబ్ధిదారులకు ఇళ్ల వద్దనే ఠంఛన్‌గా పింఛన్లు ఇస్తున్నారు. దీనిని జీర్ణించుకోలేని చంద్రబాబు ఎన్నికల కోడ్‌ను అవకాశంగా తీసుకునిఅవ్వాతాతలపై తన ప్రతాపం చూపించాడు. వలంటీర్లు పింఛన్లు పంచకూడదని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించాడు. దీంతో ఎన్నికల కమిషన్ పింఛన్ల పంపిణీ బాధ్యతలను వలంటీర్లకు తప్పించి గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి బాధ్యతలు అప్పగించింది. ఇళ్ల వద్దకే పింఛన్లు అందకుండా చంద్రబాబు చేసిన నిర్వాకంతో మళ్లీ నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయని అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువులు ఆందోళన చెందుతున్నారు.

పెన్షన్ డబ్బే ఆధారం



నాకు వృద్ధాప్య పెన్షన్ వస్తుంది. ప్రతినెల 1 వ తేదీ ఉదయాన్నే వలంటీర్ వచ్చి ఇచ్చేవారు. ఏప్రిల్1 వ తేదీ వలంటీర్ రాలేదు. ఎందుకు రాలేదో తెలియదు. పెన్షన్ మీదే అధార పడి జీవిస్తున్నాను. సమయానికి పింఛన్ డబ్బు అందకపోతే నా అవసరాలు ఎలా తీర్చుకోవాలి. మా సచివాలయానికి వెళ్లి అడగగా వలంటీర్ లేదు..ఇక నుంచి ఆఫీసుకు వచ్చి పింఛన్ తీసుకోవాలి అంటున్నారు. వృద్ధురాలు అయిన నేను కార్యాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే కష్టమవుతుంది. వలంటీర్ల ద్వారా పింఛన్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి

– ఏసురత్నమ్మ, లక్ష్మీనగర్

చంద్రబాబుకు మా ఉసురు తగులుతుంది



చంద్రబాబు నాయుడు మాలాంటి పేదలకు పెన్షన్ ఇవ్వలేదు. ఇచ్చినా అరకొరే. ఆ డబ్బు కోసం ఆఫీసుల చుట్టూ తిరగాలి. వైఎస్ జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులందరికీ పింఛను ఇస్తున్నారు. వలంటీర్ల ద్వారా ప్రతినెల 1 వ తేదీన ఇంటికి పంపిస్తున్నాడు. వలంటీర్లతో పింఛన్ పంచకూడదని చంద్రబాబు కేసు వేశారని చెబుతున్నారు. మరి మాకు తెచ్చి ఎవరిస్తారు. సకాలంలో పెన్షన్ అందకుండా మా పరిస్థితి ఏమిటి. ఇవన్నీ ఆలోచించకుండా కేసు వేసి పింఛన్ పంపిణీని అడ్డుకోవడం మంచిది కాదు. పేదలపై కోపం చూపితే ఉసురు తగులుతుంది.

– రామశేషమ్మ, గణేష్‌నగర్

దుర్మార్గమైన చర్య



పింఛన్ల పంపిణీని అడ్డుకోవడం దుర్మార్గమైన చర్య. అసలు చంద్రబాబుకు అలాంటి ఆలోచన రావడమే దారుణం. పింఛన్ తీసుకునేది ముసలివాళ్లు, వృద్ధులు, వితంతువులు .. ఈలాంటి వారిపైన చంద్రబాబునాయుడు ఫిర్యాదు చేసి పెన్షన్ నిలిపి వేయించడాన్ని ఖండిస్తున్నాము. ఇప్పటికైనా దేవుడు చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలి. ఆయనకు ఆది నుంచి పేదలంటే ఎందుకంత చులకన భావమో అర్థం కావడంలేదు. ఐదు సంవత్సరాలుగా వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. కరోనా సమయంలో ప్రాణాలు తెగించి విధులు నిర్వహించారు. ఇవన్నీ గుర్తుపెట్టుకోకుండా వారి సేవలను నిలిపివేయడం సరికాదు.

– వసంతకుమార్, బుధవారపేట, సామాజిక కార్యకర్త

వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేసుకుందాం



34వ వార్డులో ఎన్నికల ప్రచారం చేస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కర్నూలు (న్యూటౌన్): సంక్షేమ పాలన ఇలానే కొనసాగాలంటే వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేసుకుందామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 34వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి మరోసారి సంక్షేమ సారథి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. పాణ్యం నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే సాధ్యమన్నారు. ఇంటి ముంగిటకే సేవలు అందుతున్నాయని తెలిపారు. ప్రతి గ్రామంలో సచివాలయాలు, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు, ఆర్‌బీకేలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జగనన్న జెండా, ఎజెండా పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధేనని అన్నారు. ఎన్నికల సమయంలో వచ్చి మోసపూరిత హామీలిస్తున్న టీడీపీ నాయకులను నమ్మి మోసపోవద్దని అన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 600 హామీలిచ్చి ఏ ఒక్కటీ అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని గుర్తు చేశారు. ఆయన వెంట 34వ వార్డు కార్పొరేటర్ వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు

కల్లూరు మండలం బొల్లవరం గ్రామంలో టీడీపీకి చెందిన 20 కుటుంబాలు పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్ సీపీలో చేరాయి. గ్రామానికి చెందిన పుసులూరు రాముడు, వడ్డె మద్దిలేటి, బోయ రాముడు, సుంకన్న గౌడు, హరిజన చంద్ర, అంజి, మహేష్‌నాయుడు, వీరన్న, వర్ల నాగేషులు, ప్రభాకర్, నాగరాజు, బీసీ నాయుడు, గొల్ల గోపాల్, గరక మూగన్న సహా 20 కుటుంబాలకు ఎమ్మెల్యే కాటసాని పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. కాటసాని రాంభూపాల్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుంటామని వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీధర్‌రెడ్డి, చాంద్‌బాషా, మస్తాన్, నూర్ అహ్మద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిని కలిసిన బీసీ సంఘం నేతలు



ఎంపీ అభ్యర్థి రామయ్యను సత్కరిస్తున్న బీసీ సంఘం నాయకులు

కర్నూలు (టౌన్) : వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు పార్లమెంట్ అభ్యర్థి, నగర మేయర్ బీవై రామయ్యను సోమవారం బీసీ సంఘం నాయకులు కలిశారు. స్థానిక గణేష్‌నగర్‌లోని పార్లమెంట్ క్యాంపు కార్యాలయంలో ఆ సంఘం నాయకులు అయ్యన్న, శేఖర్, క్రిష్ణ తదితరులు రామయ్యను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. బీసీ కులానికి చెందిన రామయ్యను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంపీ అభ్యర్థిగా నిలపడం చాలా సంతోషంగా ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో తామంత కలిసి ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తామన్నారు.

సంక్షేమ పాలనను గెలిపించండి

- ఎన్నికల ప్రచారంలో కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్



ఇఫ్తారు విందులో అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి



ప్రచారంలో చిరువ్యాపారికి ఓటు అభ్యర్థిస్తున్న కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్

కర్నూలు (టౌన్) : సంక్షేమ పాలన అందించే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరోసారి గెలిపించాలని ఆ పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్ ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక 45వ వార్డు లేబర్ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డితో కలిసి కాలనీలో ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు. స్థానికులు, చిరు వ్యాపారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. అన్ని వర్గాలను ఐదేళ్ల పాటు ఆదుకున్న జగనన్నకు అండగా నిలబడాలన్నారు. ఆయన పాలన నచ్చి తాను ఐఏఎస్ పదవీకి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. ఎమ్మెల్యేగా తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి నగరాభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. పేద వర్గాలను ఆర్థికంగా అభివృద్ధి చేయాలన్న ఆలోచన గత పాలకులకు రాలేదన్నారు. వైఎస్ జగన్ సీఎం అయిన తర్వాత ఆ దిశగా పాలన సాగిందన్నారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా దాదాపు రూ.2.56 లక్షల కోట్లు పేదల ఖాతాల్లో జమ అయ్యాయన్నారు. మరింత మంచి జరగాలంటే రానున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సీహెచ్ మద్దయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

3 వ వార్డులో ....

నగరపాలక సంస్థ పరిధిలోని 3 వ వార్డులో ఉన్న సయ్యద్ మహరూఫ్ పీర్ సాహెబ్ మసీదులో నిర్వహించిన ఇఫ్తారు విందులో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కర్నూలు ఎమ్మెల్యే అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీమోహన్ రెడ్డి పాల్గొన్నారు. ముస్లిం నాయకులతో కలిసి దువా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆటిజం...ఇదో రకం!

- పిల్లలను వేధిస్తున్న వింత ఆరోగ్య సమస్య
- ఉంటే హైపరాక్టివ్‌గా లేకపోతే డల్‌గా ఉంటారు
- ముభావంగా, ఎవ్వరితోనూ మాట్లాడరు
- పలు రకాల థెరపీలతోనే దీనికి పరిష్కారం
- నేడు వరల్డ్ ఆటిజం అవగాహన దినం



కర్నూలు(హాస్పిటల్): మీ పిల్లలు కళ్లలో కళ్లు పెట్టి చూడలేకపోతున్నారా..తమ తోటి పిల్లలతో కలిసి ఆడుకోలేక పోతున్నారా.. ఎక్కువ సమయం ఆట వస్తువులతో గడుపుతున్నారా, ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడుతున్నారా, ప్రవర్తనలో విపరీత ధోరణి కనపడుతోందా.. తమలో తామే మాట్లాడుకుంటున్నారా, తమ భావాలను వ్యక్త పరచలేకపోతున్నారా..ఒకేచోట స్థిమితంగా కూర్చోలేకపోతున్నారా.. వారి నీడతో వారే ఆడుకుంటున్నారా.. ఎలాంటి అనుభూతిని కూడా తెలపలేకపోతున్నారా..శబ్దాలను పట్టించుకోవడం లేదా.. పిలిచినా పలుకడం లేదా.. అయితే, పై లక్షణాలన్నీ ఆటిజం అనే ఓ ఆరోగ్య సమస్యకు సంబంధించినవి. త్వరగా గుర్తించి చికిత్స చేయిస్తే సాధారణ పిల్లల్లా వారిని మార్చవచ్చు అంటున్నారు వైద్యులు. నేడు వరల్డ్ ఆటిజం అవగాహన దినం సందర్భంగా ప్రత్యేక కథనం.

ఆటిజం అనేది పిల్లల్లో వచ్చే ఒక న్యూరోలాజికల్ డెవలప్‌మెంట్ డిజార్డర్. ఇది జబ్బు కాదు. ఇది ఒక స్థితి(కండిషన్). దీనివల్ల పిల్లల్లో సోషల్ ఇంటరాక్షన్, కమ్యూనికేషన్, ప్రవర్తనా సమస్యలు, వయస్సుకు తగిన మానసిక పరిపక్వత లేకపోవడం, సెన్సరికి సంబంధించిన సమస్యలు ఉండటం వల్ల ఇది పిల్లల ఎదుగుదలకు మానసికంగా చాలా ఇబ్బందులు పెడుతుంది. మారుతున్న కాలంతో పాటు కరోనా మహమ్మారి వచ్చినప్పుడు ప్రపంచమంతా లాక్‌డౌన్‌లో ఉన్నప్పుడు పిల్లలు, పెద్దలు నాలుగు గోడల మధ్య బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఉండిన తర్వాత ఆటిజం సమస్య పిల్లల్లో ఎక్కువగా పెరుగుతుండటం చాలా ఆందోళన కలిగిస్తున్న విషయం.

ఆటిజం రావడానికి కారణాలు:

పిల్లల మెదడు ఎదుగుదలలో లోపాలు, జన్యుపరమైన లోపాలు, గర్భధారణ సమయంలో ఇన్‌ఫెక్షన్ల బారిన పడటం, తీవ్రమైన ఉద్వేగాలకు లోనవడం, నెలలు నిండకుండా శిశువు జన్మించడం, పౌష్టికాహార లోపం, ఇవే గాకుండా పరిస్థితులు, పరిసరాల ప్రభావం, తల్లిదండ్రులు నాణ్యమైన సమయాన్ని పిల్లలతో గడపలేకపోవడం, రోజులో ఎక్కువ సమయం మొబైల్స్, టీవీలు చూడటం, ఉమ్మడి కుటుంబాలు విచ్ఛిన్నమై పోవడం, పిల్లలకు ఆటలు ఆడే సమయం లేకపోవడం, ఆహారపు అలవాట్లలో మార్పులు, పాతకాలం నాటి ఆటలు కనుమరుగై పోవడం, పాతకాలం నాటి అలవాట్లు పద్ధతులను వదిలి ఆధునికతవైపు పరుగులు తీయడం, విపరీతంగా మొబైల్స్, టీవీలు చూడటం.

పలు రకాల థెరపీలతో చికిత్స



ఇది లింగభేదంతో సంబంధం లేకుండా వచ్చే సమస్య. ఈ సమస్య కలిగిన వారు తరచుగా మూర్ఛవ్యాధి, హైపరాక్టిక్ డిజార్డర్ వంటి రుగ్మతలను సైతం కలిగి ఉంటారు. ఆటిజం స్పెక్ట్రమ్ డిజార్డర్‌ను రివర్స్ చేయడానికి ఎలాంటి చికిత్స అందుబాటులో లేదు. అందుబాటులో ఉన్న అన్ని చికిత్స పద్ధతుల ముఖ్య లక్ష్యం బలహీనతలను తగ్గించి వారి సామర్థ్యాలను పెంచడమే. ఇందులో పిల్లవాడు విభిన్నంగా ఉండటమే గాకుండా ప్రత్యేక అవసరాలు కలిగి ఉంటాడు. ఈ వ్యాధిలో సమస్యలు తగ్గించేందుకు బిహేవియర్ థెరపి, కాగ్నిటివ్ థెరపీ, జాయింట్ అటెన్షన్ థెరపి, ఆక్యుపేషనల్ థెరపి, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ ఇవ్వాల్సి ఉంటుంది.

-టి. మేఘవతి, స్పెషల్ ఎడ్యుకేటర్, మల్టిపుల్ డిజేబిలిటీస్, కర్నూలు

త్వరగా గుర్తిస్తే సాధారణ స్థితికి...!



ఆటిజం ఉన్న పిల్లలను చాలా మంది తల్లిదండ్రులు ఆరు నెలల వయస్సు నుంచే సమస్యను గుర్తించవచ్చు. కొందరికి రెండు సంవత్సరాల వయస్సులో గుర్తించి వైద్యులను సంప్రదించినా ప్రమాదం నుంచి బయటపడినట్లే. ఆ వయస్సులో గుర్తించి చికిత్స ఇస్తే సాధారణ పిల్లల్లా వారిని మార్చవచ్చు. ముఖ్యంగా ఈ వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెరగాలి. ఆటిజం ఉన్న పిల్లలను దగ్గరికి తీసుకోవాలి. వారిని ప్రోత్సహించాలి. ఈ వ్యాధి రావడానికి ప్రధాన కారణం జన్యుపరకారణం ఒకటైతే తల్లులు గర్భంతో ఉన్నప్పుడు దూమపానం, ఆల్కహాలు సేవనం చేయడం, కొన్ని రకాల రసాయనాలు ఉండే చోట పనిచేయడం.

–డాక్టర్ ఆర్. మురార్జి, పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్, పీడియాట్రిషియన్, కర్నూలు

NAME CHANGE

N.VENKATA SUDHA (OLD NAME), D/o N.JAMALAIAH, H.NO: 3-87-3, SREEDEVI NAGAR, NEAR BALAJI NAGAR, KURNOOL - 518002, AP. Hereby Declare that I have changed my name as JAINKALA VENKATA SUDHA (NEW NAME), W/o J.NAIDU, H.No: 3-87-3, SREEDEVI NAGAR, NEAR BALAJI NAGAR, KURNOOL-518002.

అధైర్యపడకండి.. అండగా ఉంటా

కర్నూలు సిటీ: ఆరోగ్య సమస్యలతో బాధపడే వారు అధైర్యపడాల్సిన అవసరం లేదని..తాను అండగా ఉంటానని కోడుమూరు ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఆదిమూలపు సతీష్ బాధితులకు భరోసా ఇచ్చారు. గూడూరు నగర పంచాయతీకి చెందిన శేషన్న కుమార్తె గుండె సంబంధిత వ్యాధితో, దానయ్య కుమారుడు మధు నరాల వ్యాధితో బాధపడుతున్నారు. వారి కుటుంబసభ్యులు సోమవా రం సతీష్‌ను నగరంలోని ఆయన స్వగృహంలో కలిసి సమస్యను తెలియజేశారు. త్వరలో ఆయా జబ్బులకు వైద్య చికిత్స అందించే ఏర్పాట్లు చేస్తానని హామీ ఇచ్చారు.

అధిక ధరతో విక్రయిస్తే చర్యలు

కర్నూలు (న్యూటౌన్): దుకాణాల్లో ఎంఆర్‌పీ కంటే అధికంగా విక్రయిస్తే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ పరమేశ్‌కుమార్ హెచ్చరించారు. సోమవారం కర్నూలు నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఎదురుగా ఉన్న కూల్‌డ్రింక్, కిరాణ, బేకరీ షాపుల్లో తనిఖీలు చేశారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కర్నూలు :స్థానిక శ్రీరాం నగర్‌కు చెందిన విజయ్ కుమార్ (46) ఆనంద్ థియేటర్ సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. ఈయన ఎల్ఎల్‌బీ వరకు చదువుకున్నాడు. కొంతకాలంగా మద్యానికి అలవాటు పడి కుటుంబాన్ని పట్టించుకోకుండా అతిగా మద్యం తాగి బార్లు, మద్యం దుకాణాల వద్ద పడిపోయేవాడు. రాత్రివేళల్లో కుటుంబ సభ్యులు గాలించి ఇంటికి తీసుకెళ్లేవారు. ఆదివారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటకు వచ్చి తిరిగి రాలేదు. ఆనంద్ థియేటర్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి రోడ్డుపై పడి ఉన్నట్లు సమాచారం అందడంతో రెండో పట్టణ పోలీసులు అక్కడికి చేరుకుని ఫొటోలు తీసి పోలీసు గ్రూపుల్లో షేర్ చేశారు. వాటిని గుర్తించి విజయ్‌కుమార్ తల్లి విజయమ్మ అక్కడికి చేరుకుంది. ఈయన కొంతకాలంగా మూర్ఛ వ్యాధితో పడుతుండేవాడని తల్లి పోలీసులకు సమాచారం ఇచ్చింది. అతిగా మద్యం తాగి మూర్ఛ వ్యాధికి గురై మృతిచెందినట్లు అనుమానిస్తున్నారు.

మెడిసిన్ వైద్యులు అందుబాటులో ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): జనరల్ మెడిసిన్ వైద్యులు నిత్యం రోగులకు అందుబాటులో ఉండాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి ఆదేశించారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని జనరల్ మెడిసిన్, క్యాజువాలిటీ విభాగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొందరు వైద్యులు హాజరుపట్టిలో సంతకాలు చేయకుండా నిర్లక్ష్యంగా ఉండటం సరికాదన్నారు. జనరల్ మెడిసిన్ విభాగంలోని ఏడు యూనిట్లలో రెండు యూనిట్లలో ఆరోగ్యశ్రీ కేసులు తక్కువగా నమోదు అవుతున్నాయని, ఈ సంఖ్యను పెంచాలని ఆదేశించారు. క్యాజువాలిటీలో జనరల్ మెడిసిన్ విభాగం వైద్యులు రెగ్యులర్‌గా ఉండేటట్లు చూడాలన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక 14 వ వార్డు బుధవార పేటలో సోమవారం పేద ముస్లింలకు వైఎస్సార్ సీపీ నాయకులు మహేష్‌గౌడ్, బాబు కలిసి మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్ రెడ్డి సమక్షంలో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మాట్లాడుతూ కర్నూలు నగరంలో హిందూ, ముస్లింలు కలిసి మెలిసి పండుగలు చేసుకుంటారన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో పేద ముస్లింలకు రంజాన్ తోఫా పేరుతో నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కర్నూలు
90108 25556

Office mail : sakshiknladvt@gmail.com